నాసిన్ కంపెనీ వద్ద ప్రధాని పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రధానమంత్రి భద్రతా కార్యాలయ అధికారులు

'తోపుదుర్తి' చుట్టూ

హౌసింగ్ వివాదం

◆ నా తప్పేమీ లేదంటున్న ప్రకాష్‌రెడ్డి ◆ ఎవరూ కిడ్నాప్ అవలేదంటూ డీఎస్పీ వివరణ



అనంతపురంలో విలేకరులతో మాట్లాడుతున్న రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం రూరల్ మండల పరిధిలోని కొడిమి వద్దనున్న హౌసింగ్ లేఅవుట్ కార్మికులను రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కిడ్నాప్ చేసారంటూ పెద్దఎత్తున ప్రచారం నడిచింది. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, పోలీసులు మాత్రం ఎటువంటి కిడ్నాప్ లేదని దురుద్దేశంతో కొంత మంది చేస్తున్న దుష్ప్రచారమని కొట్టి పారేశారు. శనివారం ఉదయం నుంచి ఈ అంశం జిల్లాలో పెద్ద దుమారమే రేగింది. ఈ వివాదానికి సంబంధించి వారివారి వాదనలు ఇలా ఉన్నాయి.

డబ్బులివ్వలేదని కార్మికుల కిడ్నాప్
కాంట్రాక్టర్ సర్వర్ జహా

తాను అడిగినంత డబ్బులివ్వలేదని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఆయన బామ్మర్ది కలిపి తన సంస్థకు సంబంధించిన తొమ్మిది మంది కార్మికులను నిర్బంధించారని లేబర్ కాంట్రాక్టర్ సర్వర్ జహా ఆరోపిస్తూ ఒక వీడియోను విడుదల చేశారు. ఈ వీడియో జిల్లాలో పెద్ద ఎత్తున ప్రచారం అయ్యింది. కనబడకుండా పోయిన తొమ్మిది కార్మికులను విడిపించాలని పశ్చిమబెంగాల్ ఎంపి ఒకరు జిల్లా అధికారులకు రాసిన ఉత్తరం వాట్సప్ గ్రూపుల్లో సర్క్యులేట్ అయ్యింది. తన లాయర్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు కాంట్రాక్టర్ సర్వర్ జహా వీడియోలో పేర్కొన్నారు.

కార్మికులు ఎక్కడికీ పోలేదు
డీఎస్పీ శివారెడ్డి.

కార్మికులు అదృశ్యం అయ్యారని ప్రచారం జరుగుతుండటం అవాస్తవమని అనంతపురం రూరల్ డీఎస్పీ శివారెడ్డి తెలిపారు. సమాచారం తెలిసిన వెంటనే కొడిమి లేఅవుట్ ప్రాంతంలో పర్యటించామంటూ ఒక వీడియోను విడుదల చేశారు. మాయమ్యారని చెబుతున్న తొమ్మిది మంది కార్మికులు క్షేమంగా ఉన్నారని తెలిపారు. వీరెవరూ కిడ్నాప్‌కు గురవలేదని, వారిపనులు వారు చేసుకుంటున్నారన్నారు. కిడ్నాప్ అంటూ తప్పుడు ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరించారు.

కావాలనే దుష్ప్రచారం
ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి

కావాలనే తెలుగుదేశం నాయకులు, కొంత మంది పనిగట్టుకుని తనపై దుష్ప్రచారాలు చేస్తున్నారని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం ఆయన అనంతపురంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గృహ నిర్మాణాలను వేగవంతం చేయిం చేందుకు సొంత డబ్బులు ఖర్చు పెట్టానన్నారు. రాజకీ యంగా ఎదుర్కొనలేక తెలుగుదేశం నాయకులు ఇలాంటి అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. సర్వర్ జహా అనే కాంట్రాక్టరే డబ్బులు తీసుకుని పనిచేయకుండా పారిపోయారన్నారు. అదృశ్యం అయ్యారని చెబుతున్న కార్మికులు పనులు చేసుకుంటున్నారన్నారు. రాజకీయంగా ఎదుర్కొనలేక తాను వందల కోట్లు సంపాదించాననే అర్థంలేని ఆరోపణలు కొందరు చేస్తున్నారన, ప్రజలెవరూ వీటిని పట్టించుకునే పరిస్థితుల్లో లేరన్నారు.

ప్రధాని పర్యటనను విజయవంతం చేద్దాం

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
కలెక్టర్ పి.అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్, గోరంట్ల రూరల్

ప్రధానమంత్రి నరేంద్ర మోడి ఈనెల 16వ తేదీన శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పాలసముద్రంలో పర్యటించనున్నారని, ఇందుకు సంబంధించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పర్యటను విజయవంతం చేయాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. శనివారం నాడు పాలసముద్రంలోని నాసిన్ కేంద్రం వద్ద, హెలీప్యాడ్, పలు భవనాలు, వాహనాల రాకపోకలు, పార్కింగ్ తదితర ఏర్పాట్లపై అడ్వాన్స్ సెక్యూరిటీ లాంచ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన మంత్రి కార్యాలయం భద్రత అధికారులు పికె.యాదవ్, డిఐజి అమ్మిరెడ్డి, కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఎస్పీ మాధవరెడ్డి, ఎస్‌పిజితో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం పుట్టపర్తి కలెక్టరేట్లోని స్పందన సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని పర్యటనకు పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 16న మధ్యాహ్నం ప్రధాని పాలసముద్రం చేరుకుని అక్కడ నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. ప్రధాని వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేని విధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రధాని వస్తున్న నేపథ్యంలో రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రివర్యులు వచ్చే అవకాశం ఉందన్నారు. వారికి అవసరమైన ఏర్పాట్లను ముందస్తుగానే చేసుకోవాలని చెప్పారు. ప్రధాని పర్యటనకు సంబంధించి భద్రత, రవాణా, వసతి, వైద్య సేవలు వంటివి పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ సమన్వయంతో అవసరమైన చోట్ల స్వాగత తోరణాలు సహా ఇతర హోర్డింగ్‌లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఐదు అంబులెన్సులు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. ఫైర్ వాహనాలూ అందుబాటులో ఉంచాలన్నారు. పుట్టపర్తి ఎయిర్‌పోర్ట్, నాసిన్ హెలిప్యాడ్, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారికి జిల్లా యంత్రాంగం తరపున పాస్‌లు జారీ చేయాలని డిఆర్ఒ, పుట్టపర్తి ఆర్డీవోకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఒ కొండయ్య, పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఆర్డీవోలు భాగ్యరేఖ, వంశీకష్ణ, రమేష్ రెడ్డితో పాటు వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఖలీల్ మృతి పార్టీకి తీరని లోటు
వైసిపి ఇన్‌ఛార్జి దీపిక వేణురెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఆహ్మద్ నగర్‌లో నివాపం ఉంటున్న వైసిపి నాయకులు, ముతవల్లీ ఖలీల్ ఆకాల మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపిక వేణురెడ్డి తెలిపారు. మంత్రి పర్యటలో భాగంగా హిందూపురం రూరల్ మండలం బాలంపల్లిలో ఖలీల్ ఒక్క సారిగా కిందకు పడి స్పృహ కోల్పోయాడు. వెంటనే ఎ బ్లాక్ కన్వీనర్ సిపిసి సాదిక్‌తో పాటు మరి కొంత మంది వెంటనే పట్టణంలోని విశ్వతేజా అసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు వెంటనే బెంగళూరుకు తీసుకెళ్లాలని సూచించారు. దీంతో వారు వెంటనే బెంగళూరులోని ఓ ప్రయివేటు అసుపత్రికి తరలించి మెరుగైన వైద్య సేవలను అందించారు. నాలుగు రోజుల పాటు మృత్యువుతో పొరాడి శనివారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు మృత దేహాన్ని హిందూపురంకు తీసుకొచ్చారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఇన్‌ఛార్జ దీపిక వేణురెడ్డి, బాబురెడ్డితో పాటు పలువురు కౌన్సిలర్లు, నాయకులు సిపిసి సాదిక్, డాక్టర్ బాషాలు నివాళులు అర్పించారు. ఖలీల్ కుటుంబాన్ని అన్ని విదాల ఆదుకుంటామని దీపిక వారికి భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కిరోసిన్ బాబు, ఆసిఫ్, షాజియా, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఫారుక్, నాయకులు మార్కెట్ చాంద్, హుమయూన్, బేరింగ్ మస్తాన్, డిష్ చాంద్ బాషా, భాను, అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఎపిపి అసోసియేషన్
రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా టిఎండి ఇందాద్

టిఎండి ఇందాద్

ప్రజాశక్తి-హిందూపురం

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ప్రాక్యూటర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా హిందూపురం అదనపు జిల్లా కోర్టులో ఎపిపిగా విధులు నిర్వహిస్తున్న టిఎండి ఇందాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం నాడు గుంటూరులో 13 ఉమ్మడి జిల్లాల ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ పాల్గొని ఎపిపిల సమస్యలు, మారుతున్న కాలంతో పాటు చట్టాల పట్ల ఎలా ఉండాలన్న అంశాలపై చర్చించారన్నారు. ఎపిపి అసోసియేషన్‌కు పూర్తి స్థాయి కార్యవర్గం లేకపోవడం వల్ల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు ఇబ్బందులు ఉన్నట్లు గుర్తించారు. అదే సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారన్నారు. రాష్ట్ర కార్యవర్గంలో తనకు ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించారన్నారు. రాష్ట్ర ప్రదాన కార్యదర్శిగా ఎంపికైన టిఎండి ఇందాద్‌కు సీనియర్ న్యావాదులు రామచంద్ర రెడ్డితో పాటు పలువురు న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.

అంధత్వ నివారణకు కృషి అభినందనీయం

ప్రజాశక్తి-హిందూపురం

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చూపు లేని వారికి ట్రినిటీ ఆర్గనైజేషన్, బెంగళూరుకు చెందిన శంకర్ నేంత్రాలయ వారు సంయుక్తంగా కలిసి ఉచితంగా అంధత్వ నివారణకు కృషిచేయడం అభినందనీయమని సిఅండ్ఐజి మిషన్ చర్చి అధ్యక్ష, కార్యదర్శులు అనిల్‌కుమార్, పాల్ తెలిపారు. శనివారం పట్టణంలోని సిఅండ్ఐజి చర్చి ఆవరణంలో 104వ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెలా రెండవ శనివారం ట్రినిటీ సర్వీసెస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. చూపు కోల్పోయిన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయడంతో పాటు, కావాల్సిన మందులు, కంటి అద్దాలు ప్రయాణ సౌకర్యాలను సైతం కల్పిస్తున్నారన్నారు. అనంతరం 575 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 185 మందిని శస్త్ర చికిత్సకోసం బెంగళూరుకు పంపారు. గత నెల శస్త్ర చికిత్సలు నిర్వహించిన వారికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రినిటీ ఆర్గనైజేషన్ అధ్యక్ష కార్యదర్శులు కుమార్ రాజా, ఉషారాణి, కంటి వైద్య నిపుణులు డాక్టర్ స్నేహ, డాక్టర్ జస్ప్రీత్ కౌర్‌తో పాటు అసుపత్రి వైద్య సిబ్బంది, క్యాంపు ఇన్‌చార్జి శివప్రసాద్, వాలంటీర్లు రహంతుల్లా పాల్గొన్నారు.

మంత్రి ఉషశ్రీచరణ్ 'ఆత్మీయ పలకరింపు'

ప్రజాశక్తి-రొద్దం

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఉషశ్రీచరణ్

'ఆత్మీయ పలకరింపు' కార్యక్రమంలో భాగంగా శనివారం మంత్రి ఉషశ్రీచరణ్ మండల పరిధిలోని వైటి.రెడ్డిపల్లి, డి.రంగాపురం, దొడఘట్ట, రెడ్డిపల్లి, గోనిమేకలపల్లి, పెద్దగువ్వలపల్లి, చిన్నగువ్వలపల్లి, ఆర్.మరవపల్లి, పెద్దకోడిపల్లి, పాతర్లపల్లి, తదితర గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఆమె మాట్లాడు తూ ప్రతి ఒక్కరూ వైసిపి గెలుపు కోసం సైనికుల్లా పని చేయాలని, మరోసారి వైసిపిని అధికారంలోకి తెద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్పిటిసి పద్మ అక్కులప్ప, ఎంపిపి చంద్రశేఖర్, వైస్ ఎంపిపి అంజనరెడ్డి, రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, మారుతిరెడ్డి, కలిపి శ్రీనివాసులు, మండల కన్వీనర్ తిమ్మయ్య, విజయ్‌భాస్కర్‌రెడ్డి, రెడ్డిపల్లి సర్పంచి రామాంజి, రొద్దం సర్పంచి రూప, ధనుంజయరెడ్డి, ఎన్.నారాయణరెడ్డి, సి.నారాయణరెడ్డి, అక్కులప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.

గడప గడపకూ ఉషశ్రీచరణ్‌రెడ్డి

గోరంట్ల రూరల్ : సిఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఉషమ్మను గెలిపించాలని ఉషశ్రీచరణ్‌రెడ్డి కోరారు. ఆయన మలసముద్రం పంచాయతీ పరిధిలోని జక్కసముద్రం, మలసముద్రం, పూలచెట్లపల్లి, బూదిలివాండ్లపల్లి, తదితర గ్రామా ల్లో పర్యటించారు. గడప గడపకూ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైసిపి జెంగా ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, గంపల రమణారెడ్డి, జడ్పిటిసి పాలే జయరాం నాయక్, వైస్ ఎంపిపి నాగభూషణ్‌రెడ్డి, పాటూరి శంకర్‌రెడ్డి, పోతుల రామకష్టారెడ్డి, పివి. శివారెడ్డి, గోరంట్ల ఉప సర్పంచి రాజారెడ్డి, సమరసింహారెడ్డి, బూదిలివాండ్లపల్లి బైపరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సాయి, నాగరాజు, రవి పాల్గొన్నారు.

హిందూపురంలో వైసిపి జెండా ఎగరేస్తాం

◆ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
◆ పురంలో ముగిసిన ఆరురోజుల పర్యటన
◆ మంత్రి పర్యటనతో లాభమెంత..?

చిలమత్తూరు బహిరంగ సభలో ప్రసంగిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-చిలమత్తూరు

ఈ సారి అసెంబ్లీ ఎన్నికల్లో హిందూపురంలో వైసిపి జెండాను ఖచ్చితంగా ఎగరవేస్తాం అని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆరు రోజుల పర్యటనలో భాగంగా శనివారం చివరి రోజు మండల పరిధిలోని మొరసలపల్లి, చాగలేరు, పలగలపల్లి, సోమగట్ట, చిలమత్తూరు పంచాయతీల్లో పర్యటించి, బహిరంగ సభల్లో ప్రసంగించారు. హిందూపురంలో బాలయ్య పని అయిపోయిందని, వచ్చే ఎన్నికల్లో ఇక్కడ వైసిపి జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం రెండవ సారి రావడం ఖాయం అన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఎమ్మెల్యే దుందకుంట శ్రీధర్ రెడ్డి, జడ్పీఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎంపీ అభ్యర్థి శాంతమ్మ, హిందూపురం సమన్వయకర్త దీపిక, నవీన్‌నిశ్చల్, మండల కన్వీనర్ రాజారెడ్డి, జడ్పీటీసీ అనూష, ఎంపిపి పురుషోత్తమ రెడ్డి, జగన్ మోహన్‌రెడ్డి, సర్పంచి సంధ్య, తిరుమలేష్, కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పర్యటనతో లాభమెంత..?

హిందూపురంలో మంత్రి ఆరు రోజుల పాటు కాలికి బలపం కట్టుకుని చేసిన ప్రచారం వైసిపికి ఏ మేరకు లాభం చేకూరిందన్న ప్రచారం ఇప్పుడు సర్వత్రా వ్యక్తం అవుతోంది. రామచంద్రారెడ్డి పర్యటనతో కొత్త జోష్ వస్తుందని పార్టీ వర్గాలు అభిప్రాయ పడ్డాయి. అయితే ఆ మేరకు గ్రామాల్లో స్పందన కనిపించలేదనే భావన ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది. సభలకు ప్రజలు కదలకపోవడంతో స్వయం సహాయక సంఘాల సభ్యులను సభలలో ఉపయోగించుకోవాల్సిన పరిస్థితులు కన్పించాయి. పార్టీ నాయకత్వం ఆసక్తిగా ఉన్నా కార్యకర్తలు పెద్దగా ఉత్సాహం చూపలేదు. ఇక సభ ప్రాంతాలు ప్రధానదారుల్లో ఏర్పాటు చేయడంతో కొంత కలిసి వచ్చిందని చెప్పొచ్చు. ఇక బ్యానర్లతో టెంట్ చుట్టూ కప్పివేయడంతో కలర్ ఫుల్ వాతావరణం కన్పించింది. కేరళ డప్పులతో స్వాగతం పలికే కార్యక్రమం చేయడం ప్రత్యేకంగా నిలిచింది. హంగూ ఆర్భాటం చేసినా స్వచ్ఛందంగా ప్రజలు వచ్చిన సంఖ్య తక్కువగానే ఉందనే చెప్పాలి. స్థానిక నాయకుల మధ్య విభేదాలు కూడా సర్దుమనిగినట్లు కన్పించలేదు. సభా ప్రాంగణంలో బ్యానర్లు పెద్ద ఎత్తున వెలిశాయి. చిలమత్తూరు నాయకులు అంతా కలిసిపోయాం అని బయటకు చెప్పుకొచ్చినా ఎంపిపి, జడ్పీటీసీ వర్గాలు ఎవరి బ్యానర్‌లు వారు వేసుకున్నారు. కలిసి వేసుకున్న బ్యానర్లు మచ్చుకైనా కనపడలేదు. దీంతో వీరి మధ్య విభేదాలు సమసిపోలేదనే భావనకు అద్దం పడుతోంది. కాగా మంత్రి ఇదే నెలలో మరో మారు మూడు రోజులు పర్యటనను హిందూపురంలో నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

మడకశిర అభివృద్ధికి కృషి

ధర్మస్థలం మంజునాథ స్వామి ట్రస్టు ప్రాంతీయ సంచాలకులు దినేష్

ప్రజాశక్తి-మడకశిర

దినేష్‌ను సన్మానిస్తున్న గుండుమల తిప్పేస్వామి

గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద రైతులను గ్రామీణ అభివృద్ధి యోజన పథకం ద్వారా ఆదుకుం టామని కర్నాటకలోని ధర్మస్థలం మంజునాథ స్వామి ట్రస్టు ప్రాంతీయ సంచాలకులు దినేష్ తెలిపారు. గ్రామీణ అభివృద్ధి యోజన పథకం ద్వారా చేపట్టే కార్యక్రమాలపై రొళ్లలో శనివారం సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథిగా దినేష్ హాజరై మాట్లాడారు. మంజునాథ స్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామీణ అభివృద్ధి యోజన పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలను అన్ని రంగాల్లో ఆదుకుం టామన్నారు. రైతులకు యంత్ర పరికరాలను సబ్సిడీతో తక్కువ ధరకు అందజేస్తామన్నారు. మహిళలకు సంఘాల ద్వారా తక్కువ వడ్డీతో రుణాలు విరివిగా ఇస్తామన్నారు. ఉన్నత చదువులు చదివే విద్యార్థుల కు సైతం రుణాలు ఇస్తామన్నారు. నిరుపేదలకు వైద్య కార్డులు అందిస్తామన్నారు. గాయత్రి ఆలయ నిర్మాణానికి రూ. 2 లక్షలు అందజేశారు. కార్యక్రమంలో గుడిబండ ఎంపిడిఒ రామారావు, టిడిపి జిల్లా కార్యదర్శి ఎస్.రవిభూషణ్, కుంచిటి ఒక్కలిగ రాష్ట్ర సాధికారిక కన్వీనర్ విఎం.పాండురంగప్ప, మంజునాథ స్వామి ట్రస్ట్ పావగడ నిర్వాహకులు మహేష్, మధుగిరి ప్రాంత నిర్వాహకులు రాజగోపాల్, రామ్‌కుమార్, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

ట్రస్టు డైరెక్టర్‌కు 'గుండుమల' సన్మానం

నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి అభ్యర్థన మేరకు మడకశిర నియోజక వర్గంలోని ఐదు మండలాలతో పాటు మడకశిర మున్సిపాలిటీని ధర్మస్థల మంజునాథ స్వామి గ్రామీణ అభివృద్ధి ట్రస్ట్ దత్తత తీసుకొని అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చింది. దీంతో ట్రస్ట్ డైరెక్టర్ దినేష్‌ను గుండుమల తిప్పేస్వామి సన్మానించారు. గుండుమల మాట్లాడుతూ ధర్మస్థల గ్రామీణ అభివృద్ధి పథకం ద్వారా మహిళలు, విద్యార్థులు, రైతులు, యువతకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ట్రస్ట్ కార్యకలాపాలు త్వరలోనే ప్రారంభమవుతాయని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణను అడ్డుకున్న కందికుంట

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి పట్టణం అడపాలవీధి కోర్డులో ఉన్న సర్వే నెంబర్ 206 ప్రభుత్వ స్థలంలో వైసీపీ నాయకుడు రాత్రికిరాత్రికే చేపడుతున్న అక్రమ నిర్మాణాన్ని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కందికుంట మాట్లాడుతూ అధికార పార్టీకి చెందిన వైసీపీ నాయకుడు గతంలో రాత్రికి రాత్రే అక్రమ కట్టడం చేపడుతుంటే టీడీపీ ఆధ్వర్యంలో అడ్డుకున్నామని చెప్పారు. ఆ స్థలం కోర్టు పరిధిలో ఉందన్నారు. స్థలంలో ప్రజల కోసం ప్రభుత్వం డిజిటల్ లైబ్రరీని ఏర్పాటు చేసేందుకు కేటాయించిందని చెప్పారు. అయినప్పటికీ వైసీపీ నాయకుడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని స్థలాన్ని కబ్జా చేసి రాత్రికి రాత్రికే అక్రమ నిర్మాణం చేపట్టేందుకు పూనుకోవడం దుర్మార్గం అన్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తుంటే చూస్తూ ఊరుకోమన్నారు. ఈ విషయం తెలుసుకున్న పట్టణ సిఐ నారాయణ రెడ్డి అక్కడికి చేరుకుని అక్రమ నిర్మాణంను అడ్డుకుని ప్రభుత్వ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టారాదని సూచించారు. కబ్జాకు పాల్పడిన వైసీపీ నాయకుడిపై చర్యలు తీసుకువాలని కందికుంట పోలీసులను కోరారు.

పట్టణ ప్రగతి యూనిట్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం నగరంలోని 49వ డివిజన్ పరిధిలో ఉన్న ఇందిరానగర్‌లో పట్టణ ప్రగతి యూనిట్‌ను మేయర్ మహమ్మద్ వసీం, కమిషనర్ భాగ్యలక్ష్మి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ ప్రగతి యూనిట్ కింద కంప్యూటర్ ఎంబ్రాయిడరీపై స్కిల్ డెవలప్‌మెంట్‌తో నాలుగు రోజులు శిక్షణ ఇచ్చేందుకు కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న స్వయం సహాయక సభ్యులు ఇలాంటి యూనిట్లను ఏర్పాటు చేసుకుని ప్రభుత్వం అందించే సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మంత్రి పర్యటన విజయవంతంపై హర్షం

ప్రజాశక్తి-హిందూపురం

దీపిక వేణురెడ్డి

హిందూపురం నియోజక వర్గంలో ఆరు రోజుల పాటు రాష్ట్ర మంత్రి, పార్టీ రాయలసీమ రీజినల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటన విజయవంతం కావడంపై వైసిపి హిందూపురం ఇన్‌ఛార్జి దీపిక వేణురెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు సహకరించిన వైసిపి శ్రేణులు అందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల్లో సమస్యలను తెలుసుకున్న మంత్రి వాటి పరిష్కారం కోసం ముఖ్యమంత్రి మాట్లాడతానని హామీ ఇచ్చారన్నారు.

చంద్రబాబు హయాంలోనే ఐటి అభివృద్ధి : పల్లె

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఐటి రంగాన్ని అభివృద్ధి చేసిన ఘనత చంద్రబాబుదేనని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఐటి రంగంలో పనిచేస్తున్న ఇంజినీర్లు, ప్రొఫెషనల్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, లాయర్లతో శనివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో తెలుగు ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించగా పల్లె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అసోసియేషన్ అధ్యక్షుడు తలపనేని పాండు ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, 2024లో జరిగే పరిణామాలు, టిడిపి వస్తే జరిగే అభివృద్ధి, తదితర అంశాలపై చర్చా వేదిక ద్వారా పల్లెను ప్రశ్నించారు. పల్లె మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీ, ఎస్ఎస్ఎ, మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామన్నా రు. వచ్చే ఎన్నికల్లో మేధావుల పాత్ర కీలకమన్నారు. ఈ అరాచక పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగు ప్రొఫెసర్ అసోసియేషన్ సభ్యులు బెంగుళూరు ఐటిలో పని చేస్తున్న ఉద్యోగులు మధుసూదన్, భాను, కిరణ్, కావ్య, డాక్టర్ రాంప్రసాద్, లాయర్లు శ్రీనివాసులు, ఉపాధ్యాయుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

చర్చా వేదికలో మాట్లాడుతున్న పల్లె రఘునాథరెడ్డి

ప్రజాశక్తి
www.prajasakti.com

వినూత్న రీతుల్లో అంగన్వాడీల నిరసన

హిందూపురంలో గడ్డి తింటూ అంగన్వాడీల నిరసన

ప్రజాశక్తి-హిందూపురం

సమ్మెలో భాగంగా అంగన్వాడీలు 33వ రోజైన శనివారం వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేశారు. హిందూపురం పట్టణంలో గడ్డి తింటూ నిరసన తెలిపారు. అవసరమైతే సంక్రాంతి పండుగను సైతం సమ్మె శిబిరంలోనే చేస్తామని స్పష్టం చేశారు. పెరుగుతున్న నిత్యావసర ధరలతో ప్రభు త్వం ఇస్తున్న వేతనం సరిపోవడం లేదని, ప్రభుతం ఇచ్చే వేతనానికి గడ్డి కూడా రాదని పేర్కొంటూ గడ్డి తింటూ నిరసన తెలిపారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి లావణ్య మాట్లాడుతూ ప్రభుత్వం చర్చల పేరుతో బెదిరింపులకు పాల్పడడం దుర్మార్గమన్నారు. ఇకనైనా సిఎం జగన్ స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే అంగన్‌వాడీల ఆగ్రహానికి బలికాక తప్పదన్నారు. సంక్రాంతి పండుగ అనంతరం సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సెక్టార్ లీడర్ శైలజ, గీతావాణి, భారతి, పద్మ, వరలక్ష్మి, నాగమ్మ పాల్గొన్నారు.

పెనుకొండలో సంతకాల సేకరణ..

పెనుకొండ : పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు అంగనవాడీలు నిరవధిక సమ్మెను కొనసాగించారు. ఇందులో భాగంగా సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. 11 డిమాండ్లు నెరవే ర్చేంత వరకూ సమ్మెను కొనసాగిస్తామని హెచ్చరించారు. వీరికి సిపిఎం సీనియర్ నాయకులు హరి, ఆర్ఎంపి ఆదిశేషు, ఘనగిరి స్కూల్ కరస్పాండెంట్ ఇలియాజ్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ సంఘీభావం తెలిపి సంతకాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్, మండల కార్యదర్శి బాబావలి, ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు జయమ్మ, బావమ్మ, సెక్టార్ లీడర్లు మాబున్నీసా, వరలక్ష్మి, శ్యామలగౌరి, అనిత, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

లేపాక్షిలో వేపాకు తిని..

లేపాక్షి : అంగన్వాడీ సిబ్బంది స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు సమ్మెను కొనసాగించారు. వేతనాలు పెంచకపోతే వేపాకు తిని జీవిం చాలా అని వేపాకు తింటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నరసింహప్ప, ధనమ్మ, రత్నమ్మ, తిప్పక్క, మాధవి, భాగ్యమ్మ, సునీత, పాల్గొన్నారు.

33 ఆకారంలో కలశ పూజ..

చిలమత్తూరు : అంగన్వాడీలు ఆయా పంచాయతీల్లో 33 సంఖ్య ఆకారంలో కలశాలు ఉంచి సిఎం జగన్‌కు మంచి బుద్ధి ప్రసాదించాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రామచంద్ర, అంగన్వాడీ సంఘం నాయకులు శోభమ్మ, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

నోటీసు ప్రతులను బోగి మంటలో వేసి..

ధర్మవరం టౌన్ : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు నోటీసు ప్రతులను బోగి మంటలో వేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సిపిఎం నాయకుడు ఎస్‌హెచ్ బాషా, సిఐటియు నాయకుడు ఎల్.ఆదినారాయణ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : సమ్మెలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలు దీక్షా శిబిరంలో ప్రభుత్వానికి వ్యతిరేకం గా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ప్రభు త్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు మాబున్నీసా, సుజాత, శారద, లక్ష్మీదేవి, చంద్రకళ, సుశీల, రామలక్ష్మమ్మ, భారతి, రాధమ్మ, నాగరత్నమ్మ, మాధవి, సిఐటియు నాయకులు జివిఎల్ నరసింహులు, జగన్మోహన్, రామ్మోహన్, ముస్తాక్ పాల్గొన్నారు

మడకశిర : సమ్మెలో భాగంగా రొళ్లలో అంగన్వాడీలు శిబిరంలో దీక్షలను కొనసాగించారు. వీరికి టిడిపి కుంచిటి ఒక్కలిగ రాష్ట్ర కన్వీనర్ వి.ఎం.పాండురంగప్ప, జిల్లా కార్యదర్శి రవిభూషణ్, మురళి, తదితరులు మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ అంగన్వాడీలు 33 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అంగనవా డీల సమస్యల పరిష్కారానికి తమ వంతుగా కృషి చేస్తామని తెలిపారు.

ఓబుళదేవరచెరువు : అంగన్వాడీలు మహమ్మదాబాద్ క్రాస్‌లోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట దీక్షలను కొనసాగించారు. వీరికి సిఐటియు జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ, శ్రీరాములు, మండల అధ్యక్షులు కుళ్లాయప్ప, నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఆశీర్వాదమ్మ, వరలక్ష్మి, మణిమాల, కిష్టమ్మ, కమలమ్మ, అరుణమ్మ, సరళమ్మ. పద్మావతమ్మ, లక్ష్మీదేవి, పద్మావతి, అశ్వత్థమ్మ, శశికళకుమారి, పాల్గొన్నారు.

గాండ్లపెంట : గాండ్లపెంటలో అంగన్వాడీలు సమ్మెను కొనసాగించారు. వీరికి సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు జగన్మోహన్, స్థానిక రైతు సంఘం నాయకులు కేకే రాజారెడ్డి, ఖాదర్ బాషా మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ అంగన్వాడీ సిబ్బందికి ప్రభుత్వం నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ అధ్యక్షురాలు లక్ష్మీదేవి, భారతి, సుజాత పాల్గొన్నారు

లేపాక్షిలో వేపాకు తింటూ నిరసన

పెనుకొండలో అంగన్వాడీలకు మద్దతుగా సంతకం చేస్తున్న సవితమ్మ

ధర్మవరంలో నోటీసు ప్రతులను బోగి మంటలో వేసి..

నంబులపూలకుంటలో దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు

నేరాలు ఘోరాలు

విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ వాసుదేవన్, సిఐ కొండారెడ్డి

గొలుసుదొంగల ముఠా అరెస్టు

పుట్టపర్తి రూరల్ : గొలుసు దొంగతనాల(చైన్ స్నాచింగ్)కు పాల్పడుతున్న ముఠాను అరెస్టు చేసి బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వాసుదేవన్ తెలిపారు. డీఎస్పీ శనివారం పుట్టపర్తి అర్బన్ పోలీస్ స్టేషన్ లో సిఐ కొండారెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిం చారు. నల్లమాడ మండల పరిధిలోని చౌటకుంటపల్లికి చెందిన మల్లెల వినోద్ కుమార్, కుంచపు చంద్రమోహన్(బడవాండ్లపల్లి), రవీంద్రనాయక్(కుట్టాలపల్లి), కిరణ్‌కుమార్‌రెడ్డి(కొట్టాలపల్లి)లను అరెస్టు చేసి 4 తులాల బంగారు గొలుసులు, 4 సెల్‌ఫోన్లు, ఒక పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నామ న్నారు. ఇటీవల కాలంలో పుట్టపర్తి అర్బన్ పోలీస్ స్టేషన్‌లోనే 4 చైన్ స్నాచింగ్ కేసులు నమోదయ్యా యన్నారు. దీంతో సిఐ, ఎస్ఐలతో పాటు సిబ్బంది గాలించి చైన్ స్నాచింగ్ ముఠాను అరెస్టు చేశార న్నారు. ప్రజలు జాగ్రత్తగా వ్యవహరించాలని, అనుమానిత వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు సమా చారం ఇవ్వాలన్నారు. ముఠాను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన అర్బన్ సిఐ కొండారెడ్డి, ఎస్ఐలు వీరేష్, వెంకటరాముడు, కానిస్టేబుళ్లను డీఎస్పీ అభినందించారు.

పాతనేరస్తులు అరెస్టు

కదిరి టౌన్ : కర్నాటక మద్యం, మారణాయుధాలు కల్గి ఉన్న ముగ్గురు యువకులను అరెస్ట్ చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. ఈ మేరకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శనివారం సిఐ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గతంలో ఓ హత్య, గంజాయి కేసుల్లో నిందితులుగా ఉండి రౌడీ షీటర్లుగా నమోదైనా వారి ప్రవర్తనలో మార్పు లేదన్నారు. గత కొంతకాలంగా కర్నాటక నుంచి మద్యం అక్రమంగా తరలిస్తూ కదిరిలో విక్రయిస్తుండే వారన్నారు. పోలీసులు శనివారం పట్టణంలోని మదనపల్లి రోడ్డులో భారత్ పెట్రోల్ బంకు వద్ద తనిఖీలు చేస్తుండగా ముగ్గురు యువకులను అరెస్టు చేశారన్నారు. కదిరి పట్టణానికి చెందిన షేక్ ఖాజా, షేక్ వలిబాషా, పటాన్ ముజాహిద్దీన్ ద్విచక్ర వాహనంపై కర్నాటక మద్యం తీసుకొస్తూ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారన్నారు. వారిని తనిఖీ చేయగా కర్నాటక మద్యం, రూ. 2,01,000 నగదు, 3 కత్తులు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారన్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించామన్నారు. సమావేశంలో పట్టణ ఎస్ఐ బాబ్‌జాన్ పాల్గొన్నారు. పట్టణ పరిధిలో ఎక్కడైనా గంజాయి, నాటుసారా, కర్నాటక మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే 9440796851, 9347628896 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కర్నాటక మద్యం స్వాధీనం

మడకశిర రూరల్ : మడకశిర వ్రజపాలెంలో బేల్దారి నాగరాజు కర్నాటక మద్యం ప్యాకెట్లు తీసుకొస్తుండగా శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ లోకేష్ మాట్లాడుతూ బేల్దారి నాగరాజు వద్ద 19 కర్నాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా కర్నాటక మద్యం అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు గోదాదేవి కళ్యాణోత్సవం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో వెలసిన లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఆదివారం లక్ష్మీ చెన్నకేశవ స్వామి, గోదాదేవి కళ్యాణ మహోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ దాశెట్టి సుబ్రమణ్యం, ఇఒ వెంకటేశులు తెలిపారు. వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమా నికి ఉభయ దాతలుగా దాశెట్టి పద్మావతి, దాశెట్టి సుబ్రహ్మణ్యం వ్యవహరిస్తారన్నారు. అర్చకులు కోనేరాచార్యులు, మకరందబాబు, భానుప్రకాష్ వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు నడుమ తిరుమల తిరుపతి సంప్రదాయ పద్ధతిలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్ ఛైర్మన్ కుండా చౌడయ్య, డైరెక్టర్లు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

గాండ్లపెంట : మండల వ్యాప్తంగా ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వెంటకనారాయణ హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని ఎవరైనా కోడిపందెం, పేకాట, తదితర జూదం ఆడితే ఉపేక్షించమని స్పష్టం చేశారు. సంప్రదాయబద్ధంగా సంక్రాంతి సంబ రాలు జరుపుకోవాలని, గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా గడపాలన్నారు. ఎస్ఐతో పాటు జమేదార్లు రామయ్య, శ్రీనివాసులు, సిబ్బంది భాస్కర్, రాజు, బాషా పాల్గొన్నారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి : డిటిఎఫ్

ఓబుళదేవరచెరువు : 60ఏళ్ల పైబడిన ఉపాధ్యాయులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి, వికలాంగులు, గర్భిణులు, చిన్న పిల్లల తల్లులకు 2024 ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని డిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కట్టుబడి గౌస్ లాజమ్, షర్ఫుద్దీన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎస్సీ వర్గీకరణపై ప్రధాని మౌనం వీడాలి

మడకశిర : హైదరాబాద్‌లో నిర్వహించిన విశ్వరూప మహాసభలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఎస్సీ వర్గీకరణ విషయంలో ఇచ్చిన మాట ప్రకారం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టకపోవడం దుర్మార్గమని డిఎచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్ హనుమంతు పేర్కొన్నారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 16 వ తేదీ పాలసముద్రంకు వస్తున్న ప్రధాని మోడీ ఎస్సీ వర్గీకరణపై మాదిగలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

పుట్టపర్తిలో రసవత్తరంగా రాజకీయాలు

ప్రజాశక్తి-కొత్తచెరువు

రాష్ట్రంలో త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. పుట్టపర్తి నియోజకవర్గంలో రోజురోజుకూ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. వైసిపి, టిడిపి, జనసేన, కాంగ్రెస్ పార్టీల నాయకులు ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో తమదైన శైలిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. వైసిపి నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే డి.శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర సిఇసి సభ్యులు కొత్తకోట సోమశేఖర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, తనయుడు ఇంద్రజిత్తురెడ్డి టికెట్ కోసం పోటీ పడుతున్నారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి టికెట్ ఇస్తే తాము సహకరించబోమని ఇప్పటికే ఆశావహులు బహిరంగ ప్రకటనలు చేయడంతో అధికార పార్టీలో అసమ్మతి సెగలు వెంటాడుతు న్నాయి. అధిష్టానం వద్ద ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటున్నారు. దీంతో అభ్యర్థి ఎంపికలో తీవ్ర జాప్యం జరుగుతోంది. నియోజకవర్గంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభ్యర్థి ప్రకటన కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తెలుగుదేశం పార్టీలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఐదేళ్లుగా పార్టీ ఇన్‌ఛార్జిగా ఉంటూ నియోజకవర్గంలోని మండలాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటున్నారు. 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమా న్ని కూడా నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిర్వహించారు. లోకేష్ పాదయాత్ర సమయంలో కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు. టిడిపిలోనూ డీఎస్పీ వేణుగోపాల్, పేదరాసు సుబ్రమణ్యం, దలవాయి వెంకటనారాయణ, వడ్డే వెంకట్ టికెట్ కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. పార్టీ కోసం పని చేస్తున్నామని తమను గుర్తించి టికెట్ కేటాయించాలని కోరుతున్నారు. అయితే ఆయా పార్టీల నుంచి టికెట్లు ఎవరికి లభిస్తాయో వేచి చూడాలి.

హ్యాండ్ బాల్ క్రీడాకారిణికి ఆర్థికసాయం

నక్షత్రకు ఆర్థికసాయం అందజేస్తున్న కృష్ణమూర్తి

కదిరి టౌన్ : పట్టణంలో వాల్మీకి స్కూల్‌లో చదువుతున్న తలారి నక్షత్ర త్వరలో మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయిలో హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైంది. నక్షత్రకు శ్రీవిజయలక్ష్మి ఫౌండేషన్ అధ్యక్షులు బంగారు కృష్ణమూర్తి శనివారం రూ. 10వేలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రతినిధి వంశీ పాల్గొన్నారు.

ముగ్గులను పరిశీలిస్తున్న చిలకం మధుసూదన్‌రెడ్డి దంపతులు, విజేతకు నగదు అందజేస్తున్న చిలకం

జనసేన ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలో శనివారం జనసేనపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి ఆధ్వ ర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలకు అనూహ్య స్పందన లభించింది. స్థానిక అన్నపూర్ణేశ్వరి ఆలయ సమీపంలోని పార్టీ కార్యాలయ వద్ద నిర్వహించిన పోటీల్లో 150 మంది పాల్గొన్నారు. పట్టణానికి చెందిన హరిత, ప్రసన్న, లతాదేవి, దుర్గా, వీరనారాయణమ్మ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. పోటీల్లో పాల్గొన్న వారికి భోజన సౌకర్యం కల్పించారు. ఈ పోటీల్లో గంగిరెద్దు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పోటీల విజేతలకు చిలకం నగదు బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన ప్రసన్నలక్ష్మి, పద్మావతిలకు రూ. 5,016, ద్వితీయ బహుమతిగా సౌజన్య, సాయి సుష్మ, శ్రీదేవి, మణిమాలలకు రూ. 2,016, తృతీయ బహుమతిగా నాగజ్యోతి, చంద్ర కళ, జయశ్రీ, భాగ్యలక్ష్మి, నారాయణమ్మ, రేణుక, ప్రియాంక, ఉమా మహేశ్వరి, భవాని, మానసలకు ఒక్కొక్కరికి రూ. 1016 నగదు చిలకం అందజేశా రు. కార్యక్రమంలో బెస్త శ్రీనివాసులు, నాగసుధాకర్ రెడ్డి, శెట్టి రవి, గుర్రం జయచంద్ర, అడ్డగిరి శ్యాంకు మార్, గొట్లూరు జివి, కొటికి రామాంజి, కడపల సుధాకర్‌రెడ్డి, రాజేశ్, గంగాధర్, చిలకం సుధాకర్‌రెడ్డి, బాషా పాల్గొన్నారు.

పురం పార్లమెంట్ టిడిపి ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా మధుసూదన్

ప్రజాశక్తి-కదిరి టౌన్

కందికుంటను కలిసిన మధుసూదన్

హిందూపురం పార్లమెంట్ టిడిపి ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా కదిరి పట్టణానికి చెందిన మధుసూదన్ నియమితుల య్యారు. దీంతో మధుసూదన్ శనివారం పట్టణంలోని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట నివాసానికి వెళ్లి కందికుంటను మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలతో ఘనంగా సన్మానించారు. మధుసూదన్ మాట్లాడుతూ కందికుంట సిఫారసు మేరకు ఈ అవకాశం లభించిందని, పార్టీ బలోపేతం, కందికుంట గెలుపునకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజా శేఖర్ బాబు, పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న హరీశ్‌రెడ్డి

ఆలయ నిర్మాణానికి విరాళాల సేకరణ

నంబులపూలకుంట : స్థానిక నడిమిబోటు కొండపై నూతనంగా నిర్మించనున్న వైకుంఠ నారాయణస్వామి ఆలయ నిర్మాణానికి వైకుంఠ నారాయణస్వామి సేవా ట్రస్ట్ సభ్యులు విరాళాల సేక రణ ప్రక్రియను శనివారం నుంచి ప్రారంభించారు. మండల పరిధిలోని పెడబల్లి గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త హరీశ్‌రెడ్డి రూ. 10వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో మహేశ్వర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోను అగ్రస్థానంలో నిలపాలి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం ఆర్టీసీ డిపో అభివృద్ధికి కృషి చేసి జిల్లాలోనే అగ్రస్థానంలో నిలపాలని డిపో మేనేజర్ సత్యనారాయణ సూచించారు. స్థానిక డిపో ఆవరణలో శనివారం ఆదర్శ ఉద్యోగుల అభినందసభ ఏర్పాటు చేశారు. గత డిసెంబర్‌లో కెఎంపిఎల్, ఈపికె సాధించిన ఉద్యోగులకు డిఎం నగదు బహు మతి అందజేశారు. డిఎం మాట్లాడుతూ ధర్మవరం ఆర్టీసీ డిపోను లాభాల బాటలోకి తీసుకొచ్చేలా కృషి చేయాలన్నారు. ప్రతి ఉద్యోగి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. కార్యక్రమం లో ట్రాఫిక్ ఇన్‌ఛార్జి వెంకటేశులు, టిఐ-3 శ్రీరాములు, ఎడిసి మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

నాసిన్, బెల్‌లో స్థానికులకు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి-సోమందేపల్లి

నాసిన్, బెల్ జాతీయ సంస్థల్లో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని పెనుకొండ యాక్షన్ టీం అధ్యక్షులు పాలసముద్రం దిలీప్‌రెడ్డి పేర్కొన్నారు. సోమందేపల్లిలోని తన నివాసంలో శనివారం ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ పాలసముద్రం సమీపంలో ఏర్పాటు కాబోతున్న నాసిన్, బెల్ సంస్థల కోసం సోమందేపల్లి, గోరంట్ల మండలాలకు చెందిన అనేక మంది రైతులు 1500 ఎకరాల భూమిని ఇచ్చార న్నారు. పదేళ్ల క్రితం ప్రజావసరాల కోసం తక్కువ ధరకు ఆయా సంస్థలకు భూములు అప్పజెప్పారన్నారు. కొందరు రైతులకు ఇప్పటికీ పారితోషికం అందలేద న్నారు. ఆ తర్వాత అనేకమంది ఉపాధి కోసం బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, తదితర నగరాలకు వలస వెళ్లారన్నారు. ఈ ప్రాంతంలో ప్రస్తుతం ఎకరా రూ. 2 నుంచి రూ. 3 కోట్ల విలువ చేస్తుంద న్నారు. కావున భూములు కోల్పోయిన రైతు కుటుంబంలోని వ్యక్తులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. ఈ నెల 16వ తేదీ నాసిన్ సంస్థ ప్రారంభోత్సవానికి వస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఈ ప్రాంత రైతుల ఇబ్బందులపై వినతి పత్రం ఇస్తామన్నారు. అందుకు జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచి గంగాదేవి నరసిం హమూర్తి, వైస్ ఎంపిపి వెంకట నారాయణరెడ్డి, పెనుకొండ యాక్షన్ టీం సభ్యులు కడపల్లి కళ్యాణ్, నాగభూషణ్‌రెడ్డి, ఎల్లారెడ్డి, జగదీష్, అల్లం రమేష్, సిరివేలు రంగనాథ్, ఆదిమూర్తి, లాలేపల్లి రవీందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బలిజల సంక్షేమానికి సమిష్టిగా పనిచేద్దాం

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

అభివాదం చేస్తున్న బలిజ సంఘం నాయకులు

బలిజల సంక్షేమానికి సమిష్టిగా పని చేద్దామని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఒడిసిలో శనివారం బలిజల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించగా ముఖ్య అతిథులుగా సంగా సుధాకర్, పెదరాసు సుబ్రహ్మణ్యం హాజరై మట్లాడారు. బలిజలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలన్నా, బలిజ యువతకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కాలన్నా మనమంతా ఒక్కటి కావాలన్నారు. రాబోయే ఎన్నికల్లో బలిజ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి ఏ పార్టీ టిక్కెట్ కేటాయించినా వారిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో శివశంకర్, గవ్వల శ్రీనివాసులు, పసుపులేటి రమేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం బలిజ సంఘాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా బైరిశెట్టి, ఉపాధ్యక్షులుగా రమేష్ కుమార్, అశ్వత్థప్ప, ప్రధాన కార్యదర్శిగా శ్రీరాములు, శ్రీనివాసులు, కార్యదర్శులుగా తంగడికొండకుమార్, సాటివేలు మురళీమోహన్, చిన్నకమ్మల హరిప్రసాద్, గందోడి నాగరాజు, కమ్మల బాలాజీ, ఈసీ మెంబర్లుగా నరేంద్ర, హరిబాబు, బాలకృష్ణ, వెంకటరమణ, లోకేష్, జశ్వంత్, గౌరవ సలహా మండలి సభ్యులుగా సుధాకర్, గౌరవ ఉపాధ్యక్షులుగా తిరుపతి వెంకట చలపతి, ధనుంజయ, కిష్టప్ప, గణేష్, సుధాకర్, పూల శ్రీనివాసులును ఎన్నుకున్నారు.

మార్పుల మంటలు



ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

ఎన్నికల సమయం సమీస్తున్న కొద్ది రాజకీయాల్లో వేడి రాజుకుంటోంది. ప్రధానంగా వైసిపి ఒక్కోస్థానంపై స్పష్టత ఇస్తూ పోతోంది. ఇప్పటి మూడు జాబితాలు విడుదల చేసింది. ఇందులో ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండు పార్లమెంటు స్థానాలకు సంబంధించి కొత్త సమన్వయకర్తలను నియమించింది. వీరే వచ్చే ఎన్నికల్లో అభ్యర్థులుగా ఉంటారని ప్రకటించింది. రెండో జాబితాలో కళ్యాణదుర్గం, పెనుకొండ, కదిరి అసెంబ్లి స్థానాలకు సంబంధించి కూడా సమన్వయకర్తలను ప్రకటించింది. మూడో జాబితాలో రాయదుర్గం నియోజకవర్గానికి సంబంధించి కొత్త అభ్యర్థి వచ్చారు. ఈ మార్పులు, చేర్పులతో రాజకీయాలు వేడిని రాజేస్తున్నాయి. టిక్కెట్టు లేదని భావిస్తున్న వారు ఇతర మార్గాల వైపు చూస్తున్నారు. ఇందులో రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ఉన్నారు. మూడో జాబితాలో రాయదుర్గం అభ్యర్థిగా మెట్టుగోవింద రెడ్డిని ప్రకటించిక ముందే ఆయన వైసిపి నుంచి బయటకు పోయారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతానని ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే సిడబ్లుసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డిని కలవడం చర్చనీయాంశమైంది. ఇది నడుస్తున్న తరుణంలోనే ఆయనకు సంబంధించిన క్వారీలపైనా గనుల శాఖ అధికారులు దాడులు చేయడం గమనార్హం. ఇక టిక్కెట్టు దక్కని వారిలో హిందూపురం ఎంపి గోరంట్ల మాధవ్, కదిరి ఎమ్మెల్యే సిద్ధారెడ్డి ఉన్నారు. ఇప్పటి వరకు అధికారిక ప్రకటన వచ్చిన వాటిల్లో సిట్టింగులుండీ అవకాశం లేకుండాపోతోంది. ఇక మంత్రి ఉషచరణ్‌శ్రీకి పెనుకొండ అసెంబ్లీకి మార్పగా, అక్కడున్న సిట్టింగ్ ఎమ్మెల్యే శంకరనారాయణను అనంతపురం పార్లమెంటుకు మార్చారు. ఈ మార్పుల పరిస్థితి ఇలా నడుస్తున్న క్రమంలో శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఫేక్‌బుక్ లైవ్‌లో తొటి ఎమ్మెల్యేలపై పరోక్ష ఆరోపణలు పెద్ద దుమారమే రేగాయి. అటు తిరిగి, ఇటు తిరిగి ఆ వ్యాఖ్యలు పార్టీ వైపునకు మళ్లడంతో వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఈ స్థానంలోనూ వచ్చే ఎన్నికల్లో మార్పు ఉండే అవకాశముందని ప్రచారం నడుస్తోంది. త్వరలోనే మరిన్ని జాబితాలు వచ్చే అవకాశాలుండటంతో ఇంకెన్ని రాజకీయ మలుపులు తిరుగనున్నాయన్నది చర్చ నడుస్తోంది. అధికార పార్టీ జాబితాలు రానుండటంతో ఇక ప్రతిపక్ష టిడిపి జాబితాలు సిద్ధమవుతున్నట్టు చర్చ నడుస్తోంది. సంక్రాంతి పండుగ తరువాత టిడిపి కూడా జాబితా విడుదల చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఆ పార్టీలోనూ సర్వత్రా ఉత్కంఠత నెలకొంది. వైసిపి మార్పులకు అనుగుణంగా ఇక్కడా మార్పులుంటాయన్న చర్చ నడుస్తోంది. ఇకపోతే ఈ వారంలో కార్మికుల సమ్మెకు సంబంధించి మున్సిపల్ కార్మికుల సమ్మె వాయిదా పడింది. దీంతో కార్మికులు విధుల్లోకి చేరడంతో సమ్మె కారణంగా పేరుకుపోయిన చెత్త అంతా తొలగిపోయి పట్టణాలు శుభ్రతకు నోచుకుంటూ ఉన్నాయి. అయితే అంగన్‌వాడీల సమస్య మాత్రం కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వం చర్చలు జరిపినా ఫలించకపోవడంతో పండుగ తరువాత ఈ ఉద్యమం మరింత ఉధృతమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. విపక్షాలు కూడా కార్మికుల సమ్మెకు మద్దతునిస్తూ పాల్గొంటామని ప్రకటిస్తున్నాయి. దీంతో ఈ ఉద్యమం రాజకీయ మలుపు తిరిగే అవకాశాలున్నాయి. జిల్లాలోనూ ఇప్పటికే అంగన్‌వాడీ కార్మికులకు ఎస్మా చట్టం కింద నోటీసులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేస్తోంది. ఇటు ఉద్యమ వేడి, ఇటు రాజకీయ వేడి చలిలోనూ వణుకు పుట్టిస్తున్నాయి.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ దేవసాగర్

కుష్టుపై అపోహలు వద్దు

ప్రజాశక్తి-ముదిగుబ్బ

కుష్టు వ్యాధిపై ఎలాంటి అపోహలు వ్యాప్తి చెందకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కుష్టు, అంధత్వ నివారణ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్ వైద్య సిబ్బందికి సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆయన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి లెప్రసీ వ్యాధి నిర్ధారణ సర్వే వివరాలు తెలుసుకున్నారు. కుష్టు వ్యాధిని సకాలంలో గుర్తించి చికిత్స అందించడం ద్వారా అంగ వైకల్యం బారిన పడకుండా కాపాడగలమన్నారు. ప్రజలకు కుష్టు వ్యాధిపై పూర్తి అవగాహన కల్పించా లని సిబ్బందికి సూచించారు. ప్రజలు కూడా అపోహ చెందకుండా వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలన్నారు. సమావేశంలో జిల్లా కుష్టు వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ తిప్పయ్య, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ రాజేంద్ర, హెల్త్ సూపర్వైజర్ భాస్కర్‌రెడ్డి, ఫార్మాసిస్ట్ దీప్తి పాల్గొన్నారు

టిడిపి ఆధ్వర్యంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని కంబాలపర్తి గ్రామంలో శనివారం నిర్వహించిన 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గారెంటీ' కార్యక్రమంలో హిందూపురం పార్లమెంట్ కార్యదర్శి సోమకోటి ఆదినారాయణ పాల్గొన్నారు. గ్రామ సమీపంలో వరినాట్లు వేస్తున్న రైతులను కలిసి ఆయన వరి నాట్లు వేశారు. వారి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. టిడిపి అధికారంలోకి వస్తే కాలువల ద్వారా చెరువులను నీటితో నింపి రైతాంగాన్ని ఆదుకుంటుందన్నారు. ఏటా రైతులకు ఆర్థికంగా సాయం అందజేస్తుందన్నారు. యువతకు ఉద్యోగాలు వస్తాయని, మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా చంద్రబాబు పరిపాలన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాష్‌నాయుడు, పవన్ కళ్యాణ్, పీట్ల రమణ పాల్గొన్నారు.

కంబాలపర్తి గ్రామంలో వరినాట్లు వేస్తున్న సామకోటి ఆదినారాయణ